సైనిక సమాచార్ వారపత్రిక: 24-7-1960

# నమ్మకూడని మనుషులు

"రామయ్యా! అలా వెళ్ళొస్తా. తలుపేసుకో. రావటం ఆలస్యంగావచ్చు."

"బాబూ!"

"ఏం రామయ్యా!"

"చలిగాలి వీస్తున్నది, వొంటికంత మంచిది గాదు బాబూ!"

రామయ్యకు నేనంటే అభిమానం.

"రామయ్యా! దాక్కుంటే వచ్చే ఆపద రాకుండా పోదు!... అయినా... యిప్పుడే వచ్చేస్తా."

మఫ్లర్ తలకు చుట్టుకుని వీధిలోకొచ్చాను.

చల్లటిగాలి దేహానికి తగిలేసరికి, ప్రాణం జివజివలాడింది. కొండల మీద, ఆ పరిసర ప్రాంతాల మీద వెన్నెల కురుస్తున్నది. ఆ వెన్నెలలో దూరాన పల్లె. యిళ్ళల్లో దీపాలు కనిపిస్తున్నయ్. ఆ పల్చటి వెన్నెలలో ఆ పల్లె మేలి ముసుగు వేసుకున్న స్త్రీలా ఉంది.

ఒకప్రక్క పరుగులెత్తే పవిత్ర కృష్ణానది. ఆ నదికి ప్రక్కగా ఆ పల్లె. ఆ పల్లెను ఆనుకుని కొండల బారు. చుట్టూరా ఎటు చూచినా కొండలు! వెన్నెల! ప్రశాంత ప్రకృతి, మనసున్న మనిషికి, ఆనందాన్ని ఆస్వాదించగల వ్యక్తికి యీ సౌందర్యం చాలదూ ఆనందించటానికి.

ఎన్నో రోజులు, ఎంతటి అమూల్య కాలమో ఆ పరిసరాల్ని చూస్తూ గడిపివేశాను. కాలం రోజులు, సంఘటనలు ఎన్నో నన్ను విడిచి ముందుకు సాగిపోయినయ్. కానీ నా దృష్టి చెదరలేదు. ఏ శాంతి సౌఖ్యం కోసరమై యింతదూరం ఆప్తమిత్రులను, బంధువులను విడచివచ్చానో, దాని ఫలితం అందిందని అనుకున్నాను. నా శేషజీవితాన్ని లోకపు లావాదేవీలు, స్పర్థలు. వైషమ్యాలు, కుట్రలు, కుతంత్రాలు నన్ను దరిచేరకుండా గడిపి వేయగలనన్న ఆశ, అభిప్రాయం నాలో కలిగాయి.

అలవాటైన దారి కాబట్టి అడుగులు సవ్యంగానే పడుతున్నాయ్. చలిగాలిలో నడుస్తుంటే లోపల వున్న వ్యాధి దేహాన్ని సుఖంగా వుంచటం లేదు. గుండెలు ఎగిరిపడుతున్నయ్. కానీ వెనక్కు తిరిగే ఉద్దేశ్యమే లేదు. ఆ పల్లెగుండా వెళ్ళాలి. అక్కడ అవతలగల మర్రిచెట్టు దగ్గరకు వెళ్ళాలి. పల్చటి వెన్నెలలో పాలరాతి బుద్ధదేవుణ్ణి కడసారి చూడాలి. అప్పుడు గానీ మనసు శాంతి చెందదు. యిది నా నిత్య కృత్యం.

కట్టుకున్న భార్యను, ఆప్తబంధువులను, మిత్రులను విడిచి యింతదూరం వచ్చిననాడే, దేహంలో అంతిమశ్వాస ఆడేవరకు ఈ స్థలాలలోనే గడపాలని నిర్ణయించుకున్నాను. ఆనాటి నుంచీ ఈనాటి వరకూ పూరవతల పాలరాతి బుద్ధ విగ్రహాన్ని తదేకంగా చూస్తూనే వున్నా! అయినా నాలో యింకా తృష్ణ తీరలేదు! ఏమిటో ఆ విగ్రహాన్ని చూస్తుంటే ఏదో ఆనందం, బాధ తీయగా మెదులుతుంటుంది. అందులోనూ - ఈ వెన్నెల ఆయన దేహం మీదుగా పారుతుంటే, ఆ దేవునిలోని తేజస్సు, ఆ చిరునవ్వులోని గాంభీర్యం, ఆ మొహంలోని నిండుతనం - గాలి, నీరు, కష్టాలు, సుఖాలు అన్నీ విడిచి, మరచి తదేకంగా చూస్తూ చూస్తూండగా నా ప్రాణవాయువు అనంత విశ్వంలో కలవాలని నా కోరిక. అది సాధ్యమో, కాదో తెలియదు.

సర్వసౌఖ్యాలు, భోగాలు; పిలిస్తే పలికే పరిచారికలు, కాలు కదపకుండా సమస్తం ముందుంటాయ్! అతడు యువరాజు! అందమైన భార్య. ముద్దులొలికే పుత్రుడు. యిందర్ని వదలి గౌతముడు సత్యాన్వేషణ కోసం బయలు దేరాడు. అసలు నా అనుమానం, ఒకానొక రోజు ప్రతి మానవుడూ ఈ లావాదేవీలు వొదిలేసి దేవుడి కోసం అన్వేషణ తప్పక చేస్తాడు.

నా జీవితమూ అంతే, ఒకే విధంగా! ఎంత ఖర్చు చేసినా తరగని ధనం. కార్లు, మేడలు, బంధువులు, యింతమంది నా వెంటనంటి వుంటారు అనుక్షణం. రంగరంగ వైభవంగా నా వివాహం జరిగింది. భూమంత అరుగు వేశారు. ఆకాశమంత పందిరి. దేశం నలుమూలలనుంచీ నర్తకులు. గాయకులు, నటకులు, కవులు అందరూ నా వివాహ సమయంలో హాజరైనారు. కొన్ని వేల మానవులు చూస్తుండగా ఆమెను - యామినీదేవిని - నాదాన్ని చేసుకున్నాను. ఆనాటి నుండీ నా జీవితంలో మల్లెలు విరిశాయి. వెన్నెల కురిసింది. కోకిలలు కూశాయి. హంసలు నడయాడాయి. గాంధర్వం ఒలికింది. జీవితమొక గులాబీ తోట. ప్రపచంలోని అందం, ఆనందమంతా మాకు చేరువలో వుండి మమ్మ్ముల ఆహ్వానించినట్లున్నది.

నేను చంద్రుణ్ణి. ఆమె చంద్రిక. నేను పురుషుణ్ణి, ఆమె ప్రకృతి. మా జీవితాలు లతల్లా అల్లుకున్నాయి.

పండువెన్నెల కొబ్బరి ఆకులోంచి జారుతూ ఆమె వొడిలో పడుకున్న నా మొహం మీద పడుతుంటే, అర్ధరాత్రి ఆరుబయట ఆమె, నేనూ - మాకు తోడు లక్షలాది తారకలు;

నదీతీరం. గలగల జలజల యౌవనం వొచ్చిన అమ్మాయిలా ఏవిటో ఆనందంతో పారే నల్లని నీళ్ళు..... ఆ నీళ్ళల్లో తెల్లని ఆమె కాళ్ళు తపతప లాడిస్తుంటే....

ఆ రోజుల్లో స్వర్గంలో వున్నాను. ఆమెలో చెదిరిపోని అందాన్నీ ఆనందాన్నీ చూశాను. కొన్నేళ్ళు బయటి ప్రపంచంతో మాకు సంబంధం లేదు.

అంతే! తిరిగీ ఆ రోజులు జీవితంలో ప్రవేశిస్తాయనుకోను ఈ నాటి వరకు జరిగిందంతా ఓ తియ్యటి....?

"ఓరది?" - ఎవరో ప్రశ్నించారు.

"నేనే పోలయ్యా!"

"దండాలు దొరా! తుపానొస్తదంటగదా బాబూ!"

"వస్తే రావచ్చు!"

"పరిగత్తి యాడికి దొరా పోతుండారు! దారంత మంచిది గాదు గందా! యే తుప్పలో యేమున్నా..."

"ఫరవాలేదులే పోరా!" - సాగిపోయినా ముందుకు.

చావంటే యింత భయం ఎందుకో నా కర్థంగాదు.'జాతస్య మరణం ధృవం' అని తెలుసందరికీ! అయినా స్వార్థం, కుట్ర, వంచన వీటన్నిటితోటి బ్రతకాలనే యింకా!

నా రాకను చూసి చిరునవ్వుతో ఆహ్వానించేడు బుద్ధదేవుడు. ఆయనొక్కడే ఏ కల్మషమూ లేకుండా స్వచ్ఛంగా నవ్వగలిగేది! చివరకు యామినీదేవి నవ్వులో, నరసడి నవ్వులో లోకపు నవ్వులో అన్నిట్లో ఏదో గూఢార్థాలుంటయ్!

దేవుణ్ని ఎన్నో విధాలుగా స్తుతించారు. దయామయుడన్నారు. ఇంకా ఏవేవో అన్నారు. కానీ రాజకీయవేత్తని ఎవరూ అనలేదు. కాకపోతే సుఖాన్నీ, దుఃఖాన్నీ, వెలుగునీ, చీకటినీ, అమృతాన్నీ, హాలాహలాన్నీ ఒకేచోట సృష్టించాడు.

వాలుగాలిలో పడవలా పోతున్న మా సంసార నావలో మాకు తెలీకుండా, ఓ మూల నీరు ప్రవేశించటానికి రంధ్రం పెట్టాడు.

దగ్గు తుపానులా లేచి కాసేపు గజిబిజి చేసింది. వెధవ దగ్గు! చావనివ్వదు అలాగని బ్రతకనివ్వదు.

శిథిలమైన శిల్పంలోంచి ఏ హంపీ కన్యో ఉద్భవించిందా అనే విధంగా రంగసాని వస్తున్నది నా కోసం. ప్రతిరోజూ మా కలయిక. ప్రతిరోజూ పాపం చేస్తాం. ఈ పాలరాతి భగవానుడు అక్కడే వుండి అంతా చూస్తుంటాడు మా చర్యల్ని. కానీ ఆ చిరునవ్వు మాత్రం మానడు. అంత హాయిగా నవ్వగలగటం ఆయనకెలా సాధ్యమో?

"మీ దగ్గు గూడెంలోకి వినిపించింది ఓ యబ్బా!" - రంగసాని మాటలు తమాషాగా వుంటయ్. ఒకానొకప్పుడు యామినీదేవి మాటలు అలాగే వుండేవి.

నల్లగా, బలంగా, అందంగా వొంపులు తిరిగిన ఆమె వొళ్ళు వెన్నెట్లో నిగనిగలాడు

తున్నది. ఆమె రొమ్ములు ఉవ్వెత్తుగా లేచిపడ్తున్నయ్! ఆమె నా ఆరాధ్య దేవత అనుకుంటే పూర్తిగ మీరు తప్పు. నా శేష జీవిత అనుభవాలకు ఆమొక సమిధ. ప్రపంచంలోని అందాన్ని, ఆనందాన్నంతా అనుభవించాలి, కసితీరా నలిపి, మసి చేయాలి.

"ఎందుకట్లా చూస్తారు? ఏముంది నా దగ్గర?"

"వయసు."

తుపుక్కున నవ్వింది. ".....సాడే! అదే మా నరసడి దగ్గర అనండి! తెలుస్తుంది మజా!"

నరసడు దీని మొగుడేం కాదు అసలు. దీనికి నాథుడు వాడే ప్రస్తుతం. వాడు కాలవ పని చేస్తుంటాడు. ఇది కూడ వాడితోనే పనిచేస్తుంటుంది. మొదటిసారి దాన్నంత పరిశీలించలా! ఒకరోజు వెన్నెట్లో జాజి పందిరి దగ్గర మంచం వేసుకు మాగన్నుగా పడుకోనున్నా కుర్చీలో! ఎవరో వచ్చి నిలబడ్డ అలికిడి విని కళ్ళు తెరిచేసరికి రంగి.

"ఏం యిలా వచ్చావ్" అన్నా లేచి యింట్లోకి పోతూ. మాట్లాడకుండా వచ్చి వొళ్ళంతా చూపించింది సిగ్గు లేకుండా. రొమ్ముల క్రింద దెబ్బలు అన్నీ చూపింది. "తాగొచ్చి యిలా చావగొడతాడని" ఏడ్చింది. ఆమెను ఓదార్చా! ఆ తర్వాత ఆ రాత్రి ఆమె అక్కడే వుంది. తొలికోడి కూసేవరకూ. ఐదు రూపాయల కాగితం యివ్వబోతే తీసుకోకుండా పరిగెత్తింది.

ఆ తర్వాత రామయ్యకీ సంగతి తెలిసింది. "బాబూ ఏ లంజెనీ నమ్మకండిక్కడ. డబ్బు కోసం దేనికైనా సిద్ధం. అయినా ఈసారి ఆ లంజ ఈ ప్రాంతాల కనపడనీయండి కాళ్ళిరక్కొడతాను."

కానీ అలాంటిదేమీ జరగలేదు. ప్రొద్దుకూకేసరికి రామయ్య తాగి ఎక్కడో నిద్రపోతాడు.

♦ ♦ ♦

"ఏంటండి! ఆలోచిస్తున్నారు?" అంది రంగసాని రాయి మీద రాయేసి కొడుతూ!

"రేపు నేను వూరికెల్తున్నా రంగీ! రేపు రాను."

రంగి రాయిని కొట్టడం ఆపేసింది. ఆశ్చర్యంగా చూస్తూ, "ఏ వూరు?"

"మా వూరు, అంటే పుట్టి పెరిగిన వూరు."

"చచ్చిందాకా మీ వూరు మొగం చూడమంటిరే? మళ్ళీ యిదేంది?"

"అలా అన్నదీ నిజమే. తిరిగి ఈ స్థలం వదలకూడదనీ, వదలరాదనీ నిశ్చయించు కున్నాను. కానీ...."

"మీకు పెళ్ళయిందా?" రంగి అడిగింది. ఆమె ప్రతిరోజూ అడుగుతుంది. కానీ ఆ గత స్మృతులు జ్ఞప్తికి తెచ్చుకుని మనసు పాడుచేసుకోదలచలా!

"రంగీ! నా కథంతా చెప్తా విను. నాకు బోలెడు ఆస్థి వుంది. ఓ అక్క కూడ వుంది. ఆమెకు పెళ్ళయి, పిల్లలూ, భర్తా అంతా కులాసా. నా పెళ్ళి ఎంతో వైభవంగా జరిగింది. నా భార్య.... అన్నీ వున్నా ఈనాడు ఏవీ లేవు. దేహంలో ప్రాణాలు, డబ్బు తప్ప."

"మరి భార్యేమైంది? మంచిది కాదా?"

"భార్య వుంది. మంచిదే! కానీ నాకీ వ్యాధి వచ్చినప్పట్నుంచీ ఆమె మరో విధంగా మారిపోయింది. నన్ను అంటరానివాణ్ణిగా చూసేది. ఆఖరికి బంధువులు, మిత్రులూ అంతా దూరంగా వుండేవాళ్ళు. గుండెల్లో బాధ. పైన, భార్య ప్రవర్తన దురుసుగా వుంటే నా బాధ ఎవరితో చెప్పుకోను. ఒంటరిగా, గదిలో తెల్లటి గోడలు చూస్తూ, నానా మందులూ త్రాగుతూ ప్రాణాల కోసం ప్రాకులాడ్డం నా కిష్టం లేదు. ఆప్యాయతా, అనురాగం లేనిచోట వుండటం దేనికి?

"అలా యోచించాను. ఇప్పటికీ నా కదే ఆలోచన. మనుషులిలా మారతారెందుకు? మనిషిలోని అందం, ఆకర్షణ పోయింతర్వాత దేనికీ కొరగాడా? ఒరోజు యామినిని, మనసై రమ్మని పిలిస్తే చెంతకు రాలేదు. "ఆ వ్యాధి అంటువ్యాధి - దూరంగా వుండటం ఎందుకైనా మంచిది" అని తప్పుకుంది. ఆమె మొదట కనబరచిన ప్రేమంతా ఏమైందో మరి! ఆ తర్వాత ఆ డాక్టరుతో ఆమె ప్రేమకలాపాలు అన్నీ చూసి జీవితంపై రోతపుట్టి యిలా వచ్చా! యిదీ నా కథ!"

రంగి జాలిగా నిట్టూర్చింది. నాగరికులమనుకునే మనకంటే రంగి ఉత్తమురాలు! రామయ్య మటుకు దాన్ని నమ్మొద్దంటాడు! దాన్లో నమ్మకూడని తనమేమీ నాక్కను పించలా యిన్ని రోజుల్నించీ!

"మరి రేపెక్కడకు వెల్తున్నారు."

"మా అక్క రమ్మని వ్రాసింది. ఇంతవరకు ఆమె ఏమీ కోరలా నా నుండి. మరి కొంత కాలంలో మరో లోకంలోకి పోతూ, ఆమె కోరిక తీర్చకుండా వెళ్ళటం దేనికి? ఒక్క సారి కనుపించి పొమ్మంది. మా భార్యా భర్తల మధ్య రాజీ కుదురుస్తుందట. ఆమె మాట కాదనలేక పోతున్నా."

"మళ్ళీ యిక్కడకు రారన్నమాట రాకపోతే మానే, మీ యిద్దరూ సుఖంగా వుంటే అంతే చాలు."

రంగసాని దీవన ఫలిస్తే, అమే సంతోషించేది మొదట.

"రంగీ! నరసడు ఏమంటున్నాడు?"

"ఏమంటాడు? తాగుతాడు పూర్తిగా! వొళ్ళు తెలియకుండా నిద్దరపోతాడు. ముందు చూపేలేని మనిషి. ఎట్లాగో?" ఆమెకూ భవిష్యత్తుపై జిజ్ఞాస.

"రంగీ ఓ పనిచెప్తా చేస్తావా?"

"చెప్పండి."

"నాతో వచ్చెయ్! మా వూరెల్దాం."

రంగి మాట్లాడలా!

"ఏం రంగీ! అనుమానిస్తావెందుకు. మట్టి వాసన కొడుతూ, తాగి పొర్లాడే నరసణ్ణి వొదిలి రాలేవా?"

"రాలేను బాబూ! వాడు తాగినా, నన్ను కొట్టినా రాలేను. నరసడికి నేను, నాకు నరసడు. యిదింతే బాబూ! అలా వెళ్ళిపోవాల్సిందే!"

నాకు ఆశ్చర్యమేసింది. నరసడికి నీతి లేదు, జాతి లేదు. డబ్బు కోసం రంగిని.... అంటారు, రంగి పతివ్రతేంగాదు, కాలవల యింజనీరు దగ్గర, మేస్త్రీల దగ్గర ఉంటుంది. అయినా వారికీ అనుబంధం మమత, అనురాగం ఏమిటో! లోకం.

రంగి ఋణం తీర్చుకోలేనీ జన్మలో. ఎన్నో రాత్రులు నా ఏకాంతాన్ని సుఖాంతం చేసింది. ఆమె దేహము వొంపుల్లో నేను మెలికలు దిరిగాను. ఆమెలోని మెరుపును చూశాను. ఆమె ఋణం తీర్చుకోవాలి -

జేబులోని ఐదు వందల రూపాయల పర్సు మెల్లగా వదిలేసి, "వస్తా రంగీ" అని చెప్పి గబగబా వెళ్ళిపోయా వెనక్కు చూడకుండా!

నా బంగళా దగ్గరకెళ్ళేసరికి, జనమంతా పోగైవున్నారు. నన్ను చూసి, "బాబుగారు, బాబుగా"రని తప్పుకున్నారు. నా కర్థంగాలా అసలు విషయం. నరసడు కాలుస్తున్న బీడీ నలిపి అవతల పారేసి, "దండం దొరా! నాయాలు రామిగాడు యిల్లు చుప్తాగా దోచేసినాడు దొరా. సమయానికి నేనొచ్చేగానీ లేకపోతే యిల్లు గుల్ల!" అంటూ ప్రక్కనున్న మానవా కారాన్ని లాగి డొక్కలో తన్ని, "నాయాలా! నీయమ్మ? సిగ్గు లేదంటర! అన్నం పెట్టే మారాజుకు అన్నాయం సేస్తావంటరా!"

"బాబూ క్షమించండి. బుద్ధి నేరక తప్పుచేశా" - నా కాళ్ళ మీద పడ్డాడు రామయ్య. ఒళ్ళంతా దెబ్బలు!

"ఒరే నరిసిగా! ఒదిలెయ్‌రా!"

"అదిగాదు దొరా! నాయాలి...."

"పోనీయ్‌రా! ఎవడి పాపం వాడిది."

"మా రాజులు. అంత మంచోరు గనకనే..."

నరసన్న రామయ్యను పంపేశాడు. జనమంతా ఎక్కడివాళ్ళక్కడ సర్దుకున్నారు. నరసన్న కుర్చీ తెచ్చి బయటేశాడు కూర్చున్నా.....

నరసన్న చుట్ట ముట్టించుకు కూర్చున్నాడు పందిర గుంజ నానుకుని.

"నరసన్నా! రేపు వూరికెడుతున్నారా! మళ్ళీ రానేమో!"

"అట్టనా! దొరా! మంచిది. మమ్మల్ని మర్చిపోకండి!"

చంద్రుడు అస్తమించాడు. అప్పటిదాకా జరిగిన విషయాలన్నీ నెమరువేసుకుంటూ నిద్రపోయాను. ఎప్పుడో నరసన్న లేపి, "మంచు కురుస్తూంది బాబూ! లోపల ప్రక్కవేశా పడుకుందురు గాని లేవండి"అని లేపి యింట్లోకి పంపి వెళ్ళిపొయ్యాడు.

మర్నాడు తెల్లవారేసరికి, నే మొదట చూచింది నా ప్రక్కమీదనున్న 500 రూపాయల పర్సు మాత్రమే! ●